క్లుప్తంగా

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు

భీమవరం: పట్టణంలోని చినరంగనిపాలెం మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి పరిశీలించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సందర్శించారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, ఏడీ-1 ఎస్.సత్యనారాయణ, ఉప విద్యాశాఖ అధికారి రమేష్, ఎండీఎం సమన్వయ కర్తలు కె. కృష్ణారావు, చిన్నయ్య, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తేతలి మురుగు కాలువలో పూడిక తొలగించాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

భీమవరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తణుకు మండలంలో తేతలి నుంచి మండపాక మడుగు వరకు మురుగు కాలువలో పూడిక తొలగించాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ 20 సూత్రాల అమలు ప్రోగ్రాం సమీక్షా సమావేశంలో చైర్మన్ లంకా దినకర్‌కు సూచించారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రవీంద్రనాథ్ పాల్గొని మాట్లాడుతూ డ్రైనేజీలో పూడిక తొలగింపుతో పాటు ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మాణాలు తొలగించి గట్లు నిర్మించాలన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు నమోదు ప్రక్రియ



ఈ-శ్రమ నమోదు ప్రక్రియను తెలుపుతున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిణి

ఆకివీడు: ఈఎస్ఐ, ఈ-శ్రమ నమోదు ద్వారా కార్మికులకు ప్రభుత్వం నుంచి పలు విధాలుగా లబ్ధి చేకూరుతుందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారిణి సీహెచ్ లక్ష్మి చెప్పారు. స్థానికంగా ఐదు ప్రైవేటు ఆసుపత్రులలో పని చేస్తున్న కార్మికుల వివరాలను గురువారం ఆమె సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నమోదు ఇన్సూర్ పర్సన్ (ఐపీ) నమోదు ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నామన్నారు.

మున్సిపల్ స్కూల్‌లో ఆర్వో ప్లాంట్

భీమవరం: పట్టణంలోని మెంటేవారితోటలో మున్సిపల్ పాఠశాలకు చైల్డ్‌హుడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా కర్నాటకలో కెనరా బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న మన్నె జగదీష్ ప్రసాద్‌రావు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. విద్యనభ్యసించిన పాఠశాలపై మక్కువతో రూ.1.5 లక్షల విలువైన వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ కాశీ విశ్వనాథ్, మార్కెటింగ్ మేనేజర్ మనోజ్, స్కూల్ హెచ్ఎం శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ల గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. అనధికారంగా మద్యం అమ్ముతున్న తన్నీరు సుబ్బారావును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 10 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆకివీడు ఎక్సైజ్ ఎస్సై వి.కరుణప్రియ తెలిపారు.

నాటిక పోటీలకు పందిరిరాట ముహూర్తం

భీమవరం: చైతన్య భారతి సంగీత, నృత్య నాటిక పరిషత్ 18వ జాతీయస్థాయి నాటిక పోటీల కళావేదిక ఏర్పాటుకు గురువారం భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో పందిరిరాట ముహూర్తం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు చైతన్య భారతి నాటికల పోటీలను నిర్వహించనున్నారు.

స్థల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఎంపిక చేసిన డయాలసిస్ కేంద్రానికి స్థల పరిశీలన చేశామని భీమవరం ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ మాధవీకళ్యాణి తెలిపారు. ఈ మేరకు గురువారం భీమవరం ఏరియా ఆసుపత్రి వెనుక స్థలాన్ని ఆమె పరిశీలించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు !

- వంతెనల వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



భీమవరం కాలిబాట వంతెన వద్ద ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్



జీఎన్‌వీ కెనాల్‌పై రిటైనింగ్ వాల్ లేని వంతెన

భీమవరం అర్బన్: రెండో పట్టణ పరిధిలో కాలిబాట వంతెన వద్ద పంట కాలువకు, తాడేరు రోడ్డులోని జీఎన్‌వీ కెనాల్‌పై నిర్మించిన వంతెన వద్ద సైడ్ వాల్ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాంతాల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు సైడ్ వాల్ నిర్మించడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టడం లాంటివి చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే కాని అధికారులు స్పందించరని వాహనదారులు, ప్రయాణికుల నుంచి సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం కేంద్రం కావడంతో పలు ప్రాంతాల నుంచి ఎంతోమంది తమ పనుల నిమిత్తం రావడంతో కూడళ్లన్నీ వాహనదారులతో రద్దీగా ఉంటున్నాయి. భీమవరం రెండో పట్టణ పరిధిలో కాలిబాట వంతెన వద్ద స్తంభాలు నిర్మించి 10 మీటర్ల దూరం వదిలేయడంతో ఆ ప్రాంతం వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా వన్ టౌన్ నుంచి కాలిబాట వంతెన ద్వారా నిత్యం వందలాది వాహనాలు రావడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోవడం అది క్లియర్ అవడానికి గంటల తరబడి వేచి చూసే పరిస్థితులు నెలకొన్నాయి.

జీఎన్‌వీ కెనాల్ వంతెన వద్ద

జీఎన్‌వీ కెనాల్ వంతెన వద్ద అప్రోచ్ ఎత్తులో ఉండి సైడ్ వాల్ నిర్మించకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప, పెదగరువు, శ్రీరామపురం గ్రామాలతో పాటు నరసాపురం వెళ్లడానికి దగ్గరి మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నూతన జిల్లా ఏర్పాడ్డాక ఈ మార్గం వాహనాలతో రద్దీ ఏర్పడింది. సుమారు 100 మీటర్ల మేర రిటైనింగ్ వాల్ లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు రాత్రులు ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతాల వద్ద సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరులో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో రూ.19,300 విలువైన ఇన్వర్టర్‌ను అందజేశారు. స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు మాట్లాడుతూ దాతలు అందించిన సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో రేపాక వెంకన్నబాబు, జి.నర్మద, ఎన్.దుర్గా వరప్రసాద్, ఏవీ శ్రీలక్ష్మి, డి.అనురాధ, కె.రాజేష్ కుమార్‌రాజు, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.ప్రేమరాజు, బి.రత్నకుమారి, డి.కనకరత్నం, వై.శకుంతల, ఎం. బాల పల్లాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

13న ఆక్వా రైతు సదస్సు

ఆకివీడు: ఈ నెల 13వ తేదీన ఆక్వా రైతుల సదస్సు ఉండిలోని కోట్ల ఫంక్షన్ హాలులో నిర్వహిస్తామని ఆక్వా రైతు సంఘ ప్రతినిధి మత్రివాడ వెంకట్రావు గురువారం తెలిపారు. సమావేశంలో రొయ్యల ధరల స్థిరీకరణ, ముడిసరుకుల రేట్లు తగ్గినా మేత రేట్లు తగ్గించకపోవడం, జోన్లకు సంబంధం లేకుండా రూ.1.50 పైసలకు విద్యుత్ సరఫరా చేయడం, అధిక లోడు చార్జీలు, 45 రోజులు క్రాప్ హాలిడేపై చర్చించడం, ఇతర విషయాలపై, ఆక్వా రంగ అభివృద్ధి పై చర్చలు జరుగుతాయని వెంకట్రావు వివరించారు.

స్వచ్ఛమైన తాగునీటితో వ్యాధులకు దూరం



బస్టాండ్ ఆవరణలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి వర్మ, కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛమైన తాగునీటి ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్‌లో, జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక యూవీ వాటర్ ప్లాంట్లను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేలు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

క్యాంటీన్‌లో పరిశుభ్రత లేకుంటే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ బస్టాండ్ ప్రాంగణం పరిశీలించారు. టాయిలెట్లు, క్యాంటీన్, చంటి పిల్లలకు పాలు ఇచ్చే గది పరిశీలించి డిపో మేనేజర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. క్యాంటీన్ పరిశుభ్రత లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎంవీఆర్ వరప్రసాద్, డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కంతేటి వెంకటరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, చెరుకువాడ రంగసాయి, కారుమూరి సత్యనారాయణ మూర్తి, కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

పాలకోడేరు: ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ సహకార సంఘం వార్షికోత్సవ సందర్భంగా గురువారం పాలకోడేరు విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మదర్ నెస్ హాస్పిటల్ సహకారంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిబిరానికి వచ్చే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు సరఫరా చేస్తారన్నారు. జిల్లా సహకార సంఘం అధికారి నాగరాజు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ప్రత్యేకంగా మహిళలకు పిల్లలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు, చికిత్సలకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 80 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధురి, తహసీల్దార్ ఎస్.భారతీ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ రాంప్రసాద్, కె.వెంకటేశ్వరరావు, కొండా ఫణి కుమార్, సీఈవో వీవీఎల్ నరసింహరాజు, కునాధరాజు మురళీకృష్ణంరాజు, కొత్తపల్లి నాగరాజు, బలరామకృష్ణంరాజు, హేచరీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.2 కోట్ల నిధులు

భీమవరం: దివ్యాంగులకు ప్రతి సంవత్సరం రూ.2 కోట్ల నిధులను ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను శ్రద్ధ చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎమ్మెల్యే, పులపర్తి రామాంజనేయులు సంయుక్తంగా పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం 11వ తేదీ శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండిలోని మెయిన్ సెంటర్, పెద్ద వంతెన ఏరియా, రాజులపేట, సంతమార్కెట్, తహసీల్దార్ కార్యాలయం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

15న ఆక్వా రైతాంగ సమావేశం

భీమవరం: అమెరికా సుంకాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న ఆక్వా రైతాంగం సమస్యలపై చర్చించడానికి ఈ నెల 15న భీమవరంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా భారత దేశ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని 26 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం వలన ప్రధానంగా మన రాష్ట్రంలో ఆక్వా రైతాంగం పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సీడ్ ఫీడ్‌తో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తి కారకాలు ధరలు పెరిగి రైతులు ఆందోళనలు చెందుతుంటే రొయ్యల ధర పతనం కావడంతో రైతాంగం తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. ఆక్వా రంగ సమస్యలపై 15న నిర్వహించే సమావేశంలో ఆక్వా రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

16న సర్వసభ్య సమావేశం

ఉండి: ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు. మండల అభివృద్ధి అజెండాపై చర్చిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

18న సర్వోదయ సమ్మేళన ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం నాచుగుంటలోని సర్వోదయ స్థూపం వద్ద ఈనెల 18వ తేదీన 65వ సర్వోదయ సమ్మేళన ఆవిర్భావదినోత్సవం నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు. ప్రజల్లో సమతాభావం, జాతీయ దృక్పథం పెంపొందించే లక్ష్యంగా 1961లో నాచుగుంటలో అఖిలభారతసర్వోదయ సమ్మేళనం జాతీయస్థాయిలో నిర్వహించారన్నారు. 18వ తేదిన నిర్వహించే కార్యక్రమంలో గాంధేయవాదులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రసాదరాజు పిలుపునిచ్చారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించాలి



మహాసభలో మాట్లాడుతున్న భీమారావు

భీమవరం: పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యపరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. భీమవరం పట్టణంలో మున్సిపల్ వర్కర్ల సీపీఐ శాఖ మహాసభ గురువారం మున్సిపల్ వర్కర్ల యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మహాసభకు యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా నీలాపు శ్రీను, కార్యవర్గ సభ్యులుగా రెల్ల రాము, ధనాల విశ్వనాథ్, మాడుగుల రవికుమార్, ఆర్.పీరుబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సికిలే పుష్పకుమారి, చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నీటి తీరువా డిమాండ్ నోటీసులు



రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న డిప్యూటీ కలెక్టర్ నాగేంద్ర రెడ్డి

ఆకివీడు: నీటి తీరువా వసూళ్లకు త్వరలో డిమాండ్ నోటీసులు జారీ చేస్తామని డిప్యూటీ కలెక్టర్ బీఎస్ నాగేంద్రరెడ్డి చెప్పారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద గురువారం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1430 ఫసలీ నుంచి 1434 ఫసలీ వరకూ నీటి తీరువా (పన్ను) వసూలు చేయాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, నీటి తీరువాను నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియలో రైతుల పేర్లు, సర్వే నెంబర్లు తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, ఆర్ఐ వంతపాటి ఆంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్న ప్రజలు



జాతీయ రహదారిపై యూనియన్ బ్యాంక్ వద్ద రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలు

ఆకివీడు: జాతీయ రహదారిపై పలుచోట్ల ద్విచక్ర వాహనాలు రోడ్లపైనే నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కాఫీ హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల ముందు భారీగా ద్విచక్ర వాహనాల్ని నిలుపుతున్నారు. ఆయా షాపుల్లోనూ, మందుల దుకాణాలు, హోటళ్లలో కొనుగోలు చేసే వ్యక్తులు రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తుంది. దీంతో ఉదయం నుంచిరాత్రి వరకూ నిరంతరం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఏప్రిల్‌లోనే వేసవి తాపం చూపడంతో మధ్యాహ్న సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారని వాహన చోదకులు ఆవేదన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా జాతీయ రహదారిని స్థానిక ప్రధాన సెంటర్‌లో వెడల్పు చేయిస్తామని అధికారులు, పాలకులు చెబుతున్నా ఆచరణ సాధ్యం కాకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రహదారి విస్తరణ పనులు కొంత మంది కోసం నిలిచిపోతుంటే వేలాది మంది ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. రహదారి విస్తరణతో వ్యాపార సంస్థల్లో కూడా వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యకు కనీసం పోలీసులైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంగిమాల దేవి అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని జ్యోతిభా పూలే ఏపీ బాలికల సంక్షేమ గురుఉల పాఠశాల, ఎల్బీచర్ల బీఆర్ అంబేద్కర్ ఏపీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్‌ని పరిశీలించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పిల్లలకు అందించాలని సిబ్బందికి సూచించారు. వంట పాత్రలు, వంట చేసే ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. హస్టళ్లకు సరఫరాదారు నాసిరకం సరుకులు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్మణేశ్వరం బాలికల గురుకుల పాఠశాలలో ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు శైలజ, నల్లి సాయిబాబా, సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



కాళ్ల: అంగన్‌వాడీ కేంద్రంలో ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



వీరవాసరం: పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 22 వరకు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ హేమలత, వి.నిర్మల తెలిపారు. కాళ్ల మండలం బొండాడపేట, దొడ్డనపూడి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, పిల్లలు తీసుకోవలసిన పోషకాలు, ఆకుకూరల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బొండాడపేట సర్పంచ్ గుడ్ల మధుసూదనరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన

ఉండి: గర్భిణులకు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పించాలని సీహెచ్ఓ ఎస్ సాహితీ అన్నారు. గురువారం యండగండి 122 అంగన్‌వాడీ కేంద్రంలో 7వ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కుసుమ, చిట్టిమరియ, సుజాత, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నందమూరుగరువులో పోషణ పక్వాడా

వీరవాసరం: పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా వీరవాసరం మండలం నందమూరి గరువు గ్రామంలో గురువారం 1000 రోజుల సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌వి భారతి, ఏఎన్ఎం శ్రావణి , ఏడబ్ల్యూడబ్ల్యూ బేబీ తదితరులు పాల్గొని ఆరోగ్య ఆహార విషయాలు లో అవగాహన కల్పించడం జరిగింది.

పౌష్టికాహారం తీసుకోవాలి

భీమవరం అర్బన్: గర్భిణులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.అనిల్‌కుమారి అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్ ఆర్ నీలమ్మ, ఎమ్ సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉండి: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



భీమవరం అర్బన్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

వీరవాసరం: 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ నేతలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వి.దివాకర్ అధ్యక్షతన గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వీరవాసరం, తోలేరు, నేలపోగుల, కొణితివాడ, బాలేపల్లి, దూసనపూడి, నందమూరు గరువు, పెర్కిపాలెం, మత్స్యపురి, బొబ్బనపల్లి, నవుదూరు గ్రామాల్లో పర్యటించినట్లు నేతలు చెప్పారు. పార్టీ జిల్లా నేతలు కె.నరసింహారావు, ఏఎల్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చక్కని దస్తూరిలో శిక్షణకు ధ్రువ పత్రాలు

ఆకివీడు: దస్తూరి మెరుగు పరచుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలని హ్యాండ్ రైటింగ్ నిపుణుడు, కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. స్థానిక శారదా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గుండ్రపు దస్తూరిలో మెళుకవలు పొంది, నైపుణ్యత సాధించిన విద్యార్థులు వంద మందికి గురువారం ధ్రువ పత్రాలను ఆయన అందజేశారు.

చేనేత కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: చేనేత కార్మికులను కాపాడాలంటే మగ్గాలపై నేత వస్త్రాలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేతివృత్తుదారుల సమాఖ్య జిల్లా నాయకుడు ఎం.సీతారామ్ ప్రసాద్ అన్నారు. గురువారం చేనేత కార్మిక సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద చేనేత కార్మిక జెండాను ఆవిష్కరించారు. చేతివృత్తుదారుల సంఘం నాయకులు కేఎన్‌వీ బ్రహ్మం, మల్లుల శ్రీనివాసరావు, చాంద్‌బాషా పాల్గొన్నారు.